ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





- వార్డుల వారీగా ఓటరు జాబితా తయారు
- జిల్లాలో 335 గ్రామపంచాయతీలు, 2874వార్డులు

ఆసిఫాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు వెలువడిన ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉంది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేపట్టారు. పోలింగ్‌కేంద్రాల ఎంపిక ప్రక్రియ చేపడుతున్నారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల డ్రాఫ్ట్ నోటిఫికేషన్ అధికారులు విడుదల చేశారు. ఈనెల 13వరకు పోలింగ్‌కేంద్రాలపై అభ్యంతరాలను తెలియజేయాలని అధికారులు సూచించగా, ఆ తర్వాత తుది నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు.

● జిల్లాలో 335 గ్రామపంచాయతీలు..

జిల్లాలో 335 గ్రామపంచాయతీలున్నాయి. వాటి పరిధిలో 2874వార్డులను అధికారులు గుర్తించారు. పంచాయతీల్లో ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నారు. పోలింగ్ నిర్వహణకు 2908 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు చేపడుతున్నారు. పోలింగ్ కేంద్రాల డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. పోలింగ్ కేంద్రాలపై ఈ నెల 13 వరకు అభ్యంతరాలుంటే ఫిర్యాదులు చేయాలని పేర్కొన్నారు. అనంతరం పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ప్రకటించనున్నారు. జిల్లాలో మొత్తం 335గ్రామపంచాయతీల్లో 2874వార్డులుగా గుర్తించారు. జిల్లాలోని 15మండలాల్లో 3,51,194మంది ఓటర్లను గుర్తించారు. ఇందులో 1,75,571మంది పురుష ఓటర్లు, 1,75,605 మంది మహిళ ఓటర్లు, 18మంది ఇతరులున్నారు.

గ్రామపంచాయతీ పాలకవర్గాల పదవీకాలం గత జనవరి30తో ముగిసింది. ఫిబ్రవరి1 నుంచి ప్రత్యేక అధికారుల పాలన మొదలైంది. మొదట ఆరునెలల పాటు ప్రత్యేక అధికారుల పాలన ఉంటుందని ప్రకటించినప్పటికీ ఎన్నికలు నిర్వహించకపోవటంతో మరో ఆరునెలలుగా పొడిగించారు. దీంతో ప్రత్యేక అధికారుల పాలన మొదలై పదినెలలు దాటింది. ఎన్నికల నిర్వహణకు ఈనెలలో షెడ్యూల్ వెలువడితే జనవరి, ఫిబ్రవరి మాసాల్లో ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయని అధికారులు భావిస్తున్నారు.

● ఆశావహుల ఎదురుచూపు..

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధంగా ఉండగా, నోటిఫికేషన్ ఎప్పుడు వస్తోందా అని ఆశావాహులు ఎదురు చూస్తున్నారు. ఈనెల చివరి వారం ఎన్నికల షెడ్యూల్ విడుదల అవుతుందని, ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో ఇప్పటికే ప్రధానపార్టీలకు చెందిన నాయకులు, సర్పంచ్ పదవుల్లో బరిలో ఉండేందుకు కసరత్తులు చేపడుతున్నారు. గతంలో చాలా పంచాయతీల్లో ఏకగ్రీవ ఎన్నికలు జరుగగా, ఈసారి అంతసులువు కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు నజరాలను ప్రకటించినా ఏకగ్రీవ ఎన్నిక జరిగిన పంచాయతీలకు ఎలాంటి నజరానాలు ఇవ్వకుండా అప్పటి ప్రభుత్వం మొండిచేయి చూపింది. ఇదిలా ఉండగా, గతంలో ఇద్దరు సంతానం కంటే ఎక్కువ ఉన్న వారు అనర్హులుగా ఉండటం, ఈ సారి ఆ నిబంధన ఎత్తివేయటంతో గ్రామాల్లో ఆశావాహులు పెరిగే అవకాశాలు లేకపోలేదు. ఎన్నికల్లో ఎలాగైనా నిలబడి ఎంతైనా ఖర్చు చేసి విజయం సాధించాలన్న పట్టుదలతో చాలామంది ఇప్పటికే ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఎన్నికల నోటిఫికేషన్ కోసం అంతా ఎదురు చూస్తున్నారు.

న్యూస్ బాక్స్

108 సేవలను సద్వినియోగం చేసుకోవాలి

లింగాపూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): 108 సేవలను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని 108ప్రాజెక్టు మేనేజర్ సామ్రాట్ అన్నారు. బుధవారం ఆయన మండలానికి ప్రభుత్వం మంజూరైన 108వాహనాన్ని మండలకేంద్రంలోని జగదంబాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల ప్రజలకు ప్రభుత్వ వైద్యసేవలను అందుబాటులో ఉంచేందుకు మరింత కృషిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో 108జిల్లా అధికారి సతీష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లోకేందర్, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు చవాన్‌సునీల్ కుమార్, ఈశ్వర్ నాయక్, వైద్యసిబ్బంది దత్తరాం, తదితరులు పాల్గొన్నారు.

29న చలో హైదరాబాద్

ఆసిఫాబాద్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న 2685మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఈనెల29న తలపెట్టిన చలో హైదరాబాద్ సదస్సును విజయవంతం చేయాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా పూల్‌సింగ్‌నాయక్ కోరారు. ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘంనాయకులు శంకర్, విజేష్, పెంటయ్య, శంకర్, రమేష్, ప్రకాష్, బక్కయ్య, నరేష్, వెంకటేష్, బి. వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

కొలావార్‌లను ఎస్టీలు కాదనడం శోచనీయం

కౌటాల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ కొలావార్ల తెగను ఎస్టీలు కాదంటూ దుష్ప్రచారం చేయడంతోపాటు కరపత్రాలు పంపిణీ చేయడం, ఈ నెల 16న ఐటీడీఏ ధర్నాకు నిలుపునివ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆదివాసీ కొలావార్ సేవాసంఘం నాయకులు పేర్కొన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివాసీ కొలావార్ల తెగకు 1950నుంచి తాము అత్యంత వెనకబడి తెగగా జీవిస్తున్నామన్నారు. 2002లో మన్నెవార్లుగా ఆదివాసీ ఎస్టీజాబితాలో ఉన్నామని, 2003లో కేంద్రప్రభుత్వం మమ్మల్ని మన్నెవార్‌కు బదులుగా కొలావార్‌లుగా పార్లమెంట్‌లో చట్టం చేసిందన్నారు. కొలావార్ల చైతన్యాన్ని, ఐక్యమత్యాన్ని ఓర్వలేని వారు తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

సిర్పూర్(టి)లో సీఎం కప్ పోటీలు ప్రారంభం

సిర్పూర్(టి), డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సీఎంకప్ పోటీలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సత్యనారాయణ, తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై కమలాకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలో మండలస్థాయి సీఎం కప్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కప్‌ను క్రీడాకారులు మండలస్థాయి నుంచి జిల్లా, రాష్ట్రస్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వేణుగోపాల్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సీఎం కప్ క్రీడలు

వాంకిడి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వపాఠశాలలో గురువారం సీఎం కప్‌క్రీడలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ క్రీడల్లోపాల్గొనే వారు క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ కోసం ఆధార్‌కార్డు, బోనఫైడ్, ఎస్ఎస్‌సీ మెమోలతో హాజరు కావాలన్నారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, ఫుట్‌బాల్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహి స్తామన్నారు.

పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే: కలెక్టర్

ఆసిఫాబాద్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా పూర్తిపారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం ఆసిఫాబాద్ మండలం బూర్గుడలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్లసర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇండ్లు లేని నిరుపేదలకు గూడు కల్పించాలనే ఉద్దేశ్యంతో ఇందిరమ్మ ఇళ్లను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నియోజకవర్గానికి 3500చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 4.5లక్షల ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈక్రమంలో జిల్లాలోని అర్హులైన లబ్ధిదారు లకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు అధికారులు సమన్వయంతో కృషిచేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లయాప్‌లో దరఖాస్తుల వివరాలు, భూసంబంధిత డాక్యుమెంట్లు, ఇతర వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు. దరఖాస్తుదారుల వివరాలనమోదులో ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా ప్రత్యేకశ్రద్ధ వహించాలని తెలిపారు. అధికారులు సర్వేసిబ్బందికి పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో ఈడిస్ట్రిక్‌మేనేజర్ గౌతం, డీఈ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి..

కెరమెరి: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యంపట్ల ప్రత్యేకశ్రద్ధ వహించాలని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. బుధవారం మండలంలోని మోడి ఆశ్రమపాఠశాలను తనిఖీచేసి తరగతిగదులు, వంటగది, రిజిస్టర్లు, ఆహారం తయారీకి వినియోగించే నిత్యావసర సరుకులు, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేకశ్రద్ధ వహించాలని, మెనూ ప్రకారం ఆహారాన్ని అందించాలని తెలిపారు. ఆహారం తయారీలో తాజాకూరగాయలు, నాణ్యతగల సరుకులను వినియోగించాలని తెలిపారు. పాఠశాల, వసతిగృహాల్లో భోజనశాల, పరిసరాలు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచేలాఅధికారులు పర్యవేక్షించాలన్నారు. అనంతరం ధనోరా గ్రామంలోని మండలపరిషత్ తెలుగు, ఉర్దూపాఠశాలలో విద్యార్థుల మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించి అధికారులకు సూచనలుచేశారు. కార్యక్రమంలో డీడీరమాదేవి, ఏటీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ దత్తుప్రసాదరావు, ఎంపీడీవో అంజద్‌పాషా, ఎస్‌సీఆర్పీ శ్యాంరావు, ప్రధానోపాధ్యాయులు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



కెరమెరిలో కూరగాయలు, నిత్యావసర సరుకులు పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

కేజీబీవీని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

సిర్పూర్(యు), డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని అదనపు కలెక్టర్ దీపక్‌తివారి బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యాలయంలో వంటగది, నిలువఉన్న సరుకులను, పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం కొద్దిసేపు విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యాబోధన జరుగుతున్న తీరును అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపుకలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతు ఏజెన్సీల నుంచి కుళ్లిన కూరగాయలను తీసుకోవద్దన్నారు. నాణ్యత లేని తినుబండారాలతో వంటలు చేసి విద్యార్థులకు పెట్టకూడదని సూచించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, విద్యార్థులు అనారోగ్యానికి గురైతేవారికి మెరుగైనవైద్యం అందించాలని అన్నారు. అదేవిధంగా వ్యాధులకు గురైన విద్యార్థుల వివరాలను రిజిష్టరులో నమోదు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మండలంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కృష్ణరావ్, ఎంఈవో కుడ్మెత సుధాకర్, ఎస్ఐ స్వప్న తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

గ్రూపు-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నోడల్ అధికారి ప్రభాకర్‌రావు

ఆసిఫాబాద్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల15,16తేదీల్లో నిర్వహించే గ్రూపు-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని పరీక్షల నోడల్ అధికారి ప్రభాకర్‌రావు, రీజనల్ కోఆర్డినేటర్ లక్ష్మినర్సింహం అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రూపు-2 బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు బయోమెట్రిక్ అధికారులు మార్కండేయ, శ్రీను, సందీప్ బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లకు పలు సూచనలు, సలహాలను చేశారు. బయోమెట్రిక్ తీసుకునే సమయంలో ఎదురయ్యే సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమనిబంధనలను వివరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్‌లు, ఇన్విజిలేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గీతాజయంతి వేడుకలు

చింతలమానేపల్లి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖర్జవెల్లి గ్రామంలోని ఓంకార ఆశ్రమం, గీతామందిరంలో గీతా జయంతి వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అక్కడి భక్తులు సుప్రభాతం, నగరసంకీర్తన, ప్రణవ పతకా విష్కరణ, జ్యోతిప్రజ్వలన, గీతాపూజ, పారాయణం, మహత్మ్యలతో ఉపన్యాసము, శాంతిమంత్రాలు, భజన కార్యక్రమంతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను స్పష్టంగా నమోదు చేయాలి

● కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర రెవెన్యూ, సమాచార, హౌజింగ్‌శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్,డిసెంబరు,11(ఆంధ్రజ్యోతి): నిరుపేద ప్రజలకు గూడు కల్పించాలని ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియలో దరఖాస్తుదారుల వివరాలను పొరపాట్లు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, హౌజింగ్‌శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి సలహాదారుడు వేమ్ నరేంద్ర రెడ్డి, టీజీపీఎస్‌సీ చైర్మన్ బుర్ర వెంకటేషం ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్నిజిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు ఇతర ఉన్నతాధి కారులతో ఇందిరమ్మ ఇండ్లు, గ్రూప్-2, డైట్‌చార్జీల పెంపు, సమగ్రకుటుంబ సర్వే నిర్వహణ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల యాప్‌లో దరఖాస్తుదారుల వివరాలు ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలన్నారు. గురుకులాలు, వసతి గృహాల్లో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. టీజీపీఎస్‌సీ చెర్మన్ బుర్ర వెంకటేషం మాట్లాడుతూ ఈనెల 15,16తేదీల్లో జరుగనున్న గ్రూప్-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వేంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు, తదితరులు పాల్గొన్నారు.

సరుకుల పంపిణీలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు

వరంగల్ రిజీనల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీ లక్ష్మిబాయి

జైనూర్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): అంగన్ వాడీ కేంద్రాలకు నిబంధనల ప్రకారం సరుకులు పంపిణీ కాని ఏడల సహించేది లేదని, సంబంధితులపై కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి హెచ్చరించారు. స్థానికసీడీపీవో కార్యాలయాన్ని బుధవారం ఆమె తనిఖీచేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరుపట్టిక, పలురికార్డులను పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ గర్భిణీ, బాలింతల ఆరోగ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలకపాత్ర పోషించాలన్నారు. వారికి కేంద్రాల్లో తగిన మోతాదులో పౌష్టికాహారం అందజేయాలని సూచించారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగాఉన్నఆయాలు, అంగన్‌వాడీ పోస్టులకు వచ్చే జనవరి అనంతరం నోటిఫికేషన్ జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జైనూర్ ఐసీడీఎస్ పరిధిలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో తగిన సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతా మన్నారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న కోడిగుడ్లబరువు తక్కువగా ఉంటే వాటిని తిరస్కరించడానికి పూర్తిఅధికారం అంగన్‌వాడీ టీచర్లకు ఉందన్నారు. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలను సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తుండాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా సీడీపీవో ఇందిర పనితీరు మెరుగ్గా ఉందని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఐసీడీఎస్ అధికారి ప్రభాకర్, సీడీపీవో ఇందిర, పదవీ విరమణ పొందిన అధికారులు సావిత్రి, సలీం, యుడీసీ సత్యనారాయణ, సూపర్‌వైజర్లు పింటుబాయి, సోంబాయి, సుజాత, సిబ్బంది చందు, ఆడె గోవింద్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఆర్జేడీ ఝాన్సీ లక్ష్మిబాయి

వ్యవసాయ రంగంలో వినూత్న మార్పులు



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

వాంకిడి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉన్నతి ట్రైనింగ్‌లో భాగంగా కృషి విజ్ఞానకేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ శివకృష్ణ, డాక్టర్ తిరుపతి, నాగరాజు ఆధ్వర్యంలో ఉపాధిహామీ పథకంలో 100రోజులు పని చేసిన కూలీలకు ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయరంగంలో వినూత్న మార్పులు వస్తున్నాయని, శాస్త్రీయ పద్ధతిలో వ్యవసాయం చేస్తే పంట దిగుబడులు పెరిగే అవకాశం ఉందన్నారు. భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, ఎంపీడీవో ప్రవీణ్, హెచ్‌ఆర్ మల్లేష్, ఏపీడీ రామృష్ణ, ఏపీవో శ్రావణ్‌కుమార్, ఏపీఎం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా సీఎం కప్ పోటీలు ప్రారంభం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఆర్డీవో లోకేశ్వర్‌రావు

ఆసిఫాబాద్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గిరిజన క్రీడపాఠశాలలో ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సీఎంకప్ క్రీడాపోటీలను ఆర్డీవో లోకేశ్వర్‌రావు ప్రారంభించారు. గ్రామీణ క్రీడాకారులను వెలికితీసి రాష్ట్ర, జాతీయస్థాయిలో పాల్గొనేలా చేయడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో క్రీడాధికారిణి మీనారెడ్డి, ఏసీఎంవో ఉద్ధవ్, ఎంఈవో సుభాష్ రాథోడ్, పీఎస్‌ఎస్ అలీబిన్ అహ్మద్, ప్రధానోపాధ్యాయుడు జంగు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె



దీక్షలో కూర్చున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

ఆసిఫాబాద్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న సమ్మె కొనసాగుతోంది. బుధవారం సమ్మె రెండో రోజుకు చేరుకుంది. సమ్మెలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు తుకారాం, నాగసుధ, మోహన్, నగేష్, సంతోష్, మీనా, రమాదేవి, సందీప్, అనూప్, రాము, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

ఆసిఫాబాద్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో సాయినివాడలో బుధవారం రాత్రి అయ్యప్ప పడిపూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాయినివాడకు చెందిన సాయిని సంతోష్‌స్వామి తన నివాసంలో కుటుంబసభ్యులతో కలిసి ఆదిలాబాద్‌కు చెందిన పండితులు (గురుస్వాములు) ఫనతుల మేఘరాజ్‌శర్మ ఆధ్వర్యంలో పడిపూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామికి పల్లకీ సేవచేసి మాల ధారణ భక్తులు పేటతుల్లి ఆటలతో హోరెత్తించారు. కార్యక్రమంలో గురుస్వాములు చంద్రమోహన్, మోహన్, శ్యాంసుందర్, శ్రీనివాస్, బాలరాము, సంతోష్, శ్రీధర్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న హోంగార్డులు

ఆసిఫాబాద్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో పనిచేస్తున్న హోంగార్డు సిబ్బంది బుధవారం పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. హోంగార్డులకు రోజువారీ జీతభత్యాలు పెంచడంపై హర్షం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో హోంగార్డులు పాల్గొన్నారు.

శ్రమదానంతో రోడ్డుకు మరమ్మతులు



శ్రమదానంతో రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న గ్రామస్థులు

తిర్యాణి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొటగాం గ్రామ పంచాయతీ పరిధిలోని దాంపూర్ నుంచి తాటిగూడ వరకు 8కిలోమీటర్ల రోడ్డుకు తాటిగుడ, కేరేగూడ, గీసిగూడ గ్రామానికి చెందిన ఆదివాసీలు బుధవారం శ్రమదానంతో రోడ్డుకు మరమ్మతులు చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు కొట్నాక గణపతి, పటేళ్ల అంబరావు, మోతీరాం, శంకర్, బారిక్‌రావు, రాజు, చిత్క తదితరులు పాల్గొన్నారు.

సినీనటుడు మోహన్ బాబుపై చర్యలు తీసుకోవాలి



సీఐ రవిందర్ కు ఫిర్యాదు చేస్తున్న జర్నలిస్టులు

ఆసిఫాబాద్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు మోహన్‌బాబుపై కఠినచర్యలు తీసుకోవాలని ఆసిఫాబాద్ జర్నలిస్టులు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో మంచు కుటుంబంలో చెలరేగిన వివాదం కవరేజ్ కోసం వెళ్లిన జర్నలిస్టులపై మోహన్ బాబు దాడి దిగడంపై జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా మండిపడ్డాయి. అతనిపై కేసు నమోదు చేయాలని బుధవారం ఆసిఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ రవీందర్ కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వృద్ధుడి ఆత్మహత్య


బాలమల్లు(ఫైల్)

దండేపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం రెబ్బెనపల్లి గ్రామశివారులో పొన్నం బాలమల్లు(66) అనేవృద్ధుడు ఇంట్లో గొడవ పడి మనస్తాపంతో పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు దండేపల్లి ఎస్‌ఐ ఉదయ్‌కిరణ్ తెలిపారు. బాలమల్లు కుటుంబీకులు, ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. లక్షెట్టిపేట మండలం వెంకట్‌రావుపేట గ్రామానికి చెందిన బాలమల్లు తన మనుమరాలు పుట్టిన రోజు విషయం కుటుంబ సభ్యులతో మాట్లాడు తున్న తరుణంలో ఇంట్లో గొడవ జరిగింది. దీంతో బాలమల్లు మనస్తాపం చెంది మంగళవారం తన బైక్‌పై ఇంటి నుంచి వెళ్లిపోయాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు ఆందోళన చెంది గాలించినా ఆచూకీ దొరకలేదు. బుధవారం ఉదయం దండేపల్లి మండలం రెబ్బెనపల్లి గ్రామ శివారులో గుర్తు తెలియని శవం ఉన్నట్లు తెలియడంతో కుటుంబీకులు సంఘటనస్థలానికి చేరుకుని చూడగా బాలమల్లుగా గుర్తించారు. బాలమల్లుకు భార్య, ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కొడుకులు ఉన్నారు. భార్య సుశీల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


తిరుపతి(ఫైల్)

కాసిపేట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సోమగూడెం మధుర హోటల్ వై జంక్షన్ వద్ద మంగళవారం రాత్రి రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓవ్యక్తి మృతి చెందాడు. ఈప్రమాదంలో మరో ఐదుగురికి గాయాలయ్యాయి. కాసిపేట ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం,, బెల్లంపల్లి హనుమాన్ బస్తీకి చెందిన సింగరేణి రిటైర్డు కార్మికుడు దెబ్బటి తిరుపతి కుటుంబీకులతో కారులో శ్రీరాంపూర్‌లోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి హాజరై తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో సోమగూడెం మధుర హోటల్ వైజంక్షన్ వద్దకు రాగానే మహారాష్ట్రకు చెందిన హిమాన్షు వినోద్ పన్నాసే కారుతో అతి వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న దెబ్బటి తిరుపతి (65) అక్కడికక్కడే మృతిచెందాడు. తిరుపతి మృతుని భార్య మహేశ్వరి, కూతురు శ్రీవిద్య, శ్రీవిద్య పిల్లలు మహశ్రీ, అచ్యుతానంద్‌లతో పాటు డ్రైవర్ హరీష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తిరుపతి కొడుకు దెబ్బటి విక్రమ్ ఫిర్యాదు మేరకు హిమాన్షు వినోద్ పన్నాసేపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సంఘటన స్థలతాన్ని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి,నేషనల్ హైవే అథారిటీ అధికారులు సునీల్, వెంకటేష్ పర్యవేక్షించారు. వై జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు నమోదు

బెల్లంపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన యాదగిరి సాయిచరణ్, చిప్పపర్తి రాకేష్‌పై బుధవారం కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ ఎస్‌ఐ మహేందర్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం రాత్రి పెద్దనపల్లి రైల్వేస్టేషన్ ఏరియాలో డీజే బాక్సులతో అధికసౌండ్ పెట్టి ఇబ్బందులు కలిగిస్తున్నారని సమాచారం అందిందన్నారు. దీంతో కానిస్టేబుల్ సాయికిరణ్, హోంగార్డు శివలు అక్కడకు వెళ్లి డీజే సౌండ్ బంద్‌చేయాలని సూచించారు. దీంతో సాయిచరణ్, రాకేష్ పోలీసులతో వాగ్వాదానికి దిగి విధులకు ఆటంకం కలిగించినందుకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

మందమర్రిటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఒకటో జోన్‌లో గల పాడు బడిన సింగరేణి క్వార్టర్‌లో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మందమర్రి తహసీల్దార్ సతీష్ , సిబ్బంది బుధవారం సాయంత్రం పట్టుకున్నారు. పట్టుకున్న రేషన్ బియ్యాన్ని అనిల్ రేషన్ డీలర్ షాపుకు తరలించినట్లు తహసీల్దార్ తెలి పారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారికి సమాచారం అందించినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తే కఠిన చర్యలు తీసు కుంటామని తెలిపారు.

బాధితులకు సత్వర న్యాయం చేయాలి


సిబ్బందితో మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్

శ్రీరాంపూర్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం చేయాలని జైపూర్ ఏసీపీ ఎ వెంకటేశ్వర్ అన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా బుధవారం ఆయన శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ, ఫిర్యాదుల విషయంలో వెంటనే స్పందించాలని, మహిళలు, పిల్లలు, సీనియర్ సిటిజన్లతో మర్యాదగా నడుచుకోవాలని ఆదేశించారు. బ్లూకోల్ట్స్, పెట్రోకార్ సిబ్బంది రాత్రి సమయంలో రౌడీ షీటర్లు, ఇతర నేరస్తుల ఇళ్లను, పాయింట్ బుక్స్‌లను తనిఖీ చేయాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించి ప్రజలు సమస్యలు తెలుసుకోవాలని చెప్పారు. ఫిర్యాదులు స్వీకరించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిం చాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాల సరఫరా, విక్రయం, అక్రమ రవాణా వంటి అసాంఘిక కార్యక్ర మాలపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. ముందుగా ఆయన పోలీస్‌స్టేషన్ రికార్డులు, పోలీసు అధికారులు, సిబ్బంది వివరాలు, వారి విధులు, పనితీరు, సమస్యల గురించి, స్టేషన్ పరిధిలో భౌగోళిక పరిస్థితులు, కాలనీలలో జరిగే నేరాలు, తదితర విషయాలను ఎస్‌ఐని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్‌ఐలు సంతోష్, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

హాజీపూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ పెద్దపల్లి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానికసంస్థల నుంచి చట్టసభల వరకు దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలని, నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లల్లో ఐదు శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, 2016 చట్టాన్ని అన్ని శాఖలు అమలు చేయాలని, ఉచిత బస్సు, రైలు ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా దివ్యాంగులకు రూ. 6 వేల పింఛన్ అమలు చేయాలని కోరారు. సమావేశంలో కన్వీనర్ చిప్పకుర్తి సురేష్, నాయకులు ప్రకాష్, రాజశే ఖర్, భీమారాజు, రాజమౌళి, చంద్రయ్య, రాజలింగు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కాపర్, ఇనుప వస్తువులు స్వాధీనం

తాండూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థకు సంబంధించిన ఇనుప వస్తువులను స్క్రాప్ షాపుల నిర్వహకులు కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సింగరేణి అధికారులు హెచ్చరించారు. మండలంలోని బోయపల్లి బోర్డులోని స్క్రాప్ దుకాణంలో బుధవారం అధికారులు సోదాలు నిర్వహించారు. 170 కిలోల కాపర్, ఐదు క్వింటాళ్ల ఇనుప వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో సింగరేణి అధికారులు, ఎస్‌అండ్‌పీసీ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

మందమర్రిటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఊరు మందమర్రి చెరువు ఆక్రమణతో పాటు బఫర్ జోన్‌లో నిర్మాణం చేసిన పాఠశాలతో పాటు బహుళ అంతస్తుల నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని చెన్నూరు నియోజకవర్గ కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షుడు ఎండీ నయీం బుధవారం తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌లకు వినతి పత్రాలు అందజేశారు. ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉల్లి తగ్గదు.. వెల్లుల్లి దిగదు

- వెల్లుల్లి కిలో ధర రూ.400
- ఉల్లి ధర రూ.50పైమాటే





బెజ్జూరు, డిసెంబరు 11(ఆంధ్రరజ్యోతి): ఈ రెండు లేకుంటే వంటలు రుచికరంగా ఉండవు. అన్ని కూరల్లో అన్ని రకాల వంటల్లో వాడే ఉల్లిగడ్డ, వెల్లుల్లి ధరలు ప్రస్తుతం మార్కెట్‌లో అమాంతం పెరిగాయి. ధరలు చూసి ఎలా కొనుగోలు చేయాలంటూ సామాన్యులు వాపోతున్నారు. ప్రస్తుతం వివాహాల సీజన్ కావడంతో ఈ రెండింటికి మంచి డిమాండ్ ఉంటుంది. అటు శాఖాహారం కానీ, మాంసాహారం వంటకాల్లో కానీ ఈ రెండు తప్పనిసరిగా ఉండాల్సిందే. అవి ఉంటేనే కూరలు ఘుమఘుమలాడుతాయి. ప్రస్తుతం ధరలు పైపైకి పోతుండటంతో సామాన్యులు కొనలేని స్థితిలో ఉన్నారు. ఏ ఇంటిలోనైనా అన్నిరకాల వంటకాల్లో వాడే పదార్థాలు కావడంతో వీటికి మంచి డిమాండ్ ఉంటోంది.

తగ్గని ఉల్లి ధర..

కొన్ని నెలలుగా ఉల్లి ధర తగ్గడం లేదు. రిటైల్ మార్కెట్‌లో కిలో ఉల్లి రూ.50పైమాటే. సాధారణంగా వర్షాకాలం ఎక్కువ ధర ఉండే ఉల్లి ప్రస్తుతం శీతాకాలంలోనూ ధర తగ్గుముఖం పట్టడం లేదు. ధర తగ్గాక కొనుగోలు చేద్దామనుకుంటున్న వారికి నిరాశే మిగులుతోంది. గత్యంతరం లేక తక్కువ మోతాదులో ఉల్లిని కొనుగోలు చేస్తున్నారు. నవంబరు నెలలో సాధారణంగా కిలో ఉల్లి ధర రూ.15 నుంచి 20గా ఉంటుంది. అయితే ప్రస్తుతం రెండింతలు పెరిగింది. గడిచిన ఆరునెలలుగా ఉల్లి ధర పెరుగుతూనే ఉంది. సాధారణ పౌరుడు కొనలేని పరిస్థితి ఏర్పడింది.

వెల్లుల్లిదీ అదే దారి..

వెల్లుల్లి సంగతి చెప్పనక్కర్లేదు. సామాన్యుడు కొనలేని స్థాయికి ధర పెరిగిపోయింది. ప్రస్తుతం మార్కెట్‌లో వెల్లుల్లి కిలోకు రూ.400పలుకుతోంది. పావుకేజీ రూ.100ఉంది. స్థానికంగా పండించకపోవడం, దిగుమతిపై ఆధారపడటమే ధరలు తగ్గక పోవటానికి ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవడంతో ధరలు అమాంతం పెరగడానికి కారణమవుతోందని వ్యాపారులు చెబుతున్నారు. మరికొద్ది రోజులు ధరలు ఇలాగే నిలకడగా ఉండే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

కాగజ్‌నగర్ , డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీ బిల్లులను వెంటనే విడుదల చేయాలని టీఎస్‌టీయూఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి తెలిపారు. బుధవారం కాగజ్‌నగర్ మండలంలోని సంఘ సభ్యులతోఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పెండింగ్ బిల్లులు విడుదల కాకపోవటంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న సీఆర్టీ, పార్ట్‌టైం, ఔట్‌సోర్సింగ్, గెస్ట్‌ఉపాధ్యాయులందరికీ మినిమం టైంస్కేల్ వర్తింపు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షురాలు ప్రీతి, జిల్లా మహిళాకమిటీ సభ్యులు మహిపాల్, జిల్లా మహిళా కమిటీ కన్వీనర్ లలితతోపాటు సభ్యులు పాల్గొన్నారు.

16న సీఈఆర్ క్లబ్‌లో ఆయుర్వేద వైద్యశిబిరం

రెబ్బెన, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియా సింగరేణి సేవాసమితి ద్వారా మాతా రీసెర్చ్ సెంటర్, హైదరాబాద్ డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్యశిబిరం ఈనెల16న నిర్వహించనున్నారు. ఈ శిబిరంలో దీర్ఘకాలిక వ్యాధులు, కీళ్లనొప్పులు, బీపీ, షుగర్ తదితర వంటి వ్యాధులకు చికిత్సలు అందించనున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ మండలాధ్యక్షుడిగా తిరుపతి

బెజ్జూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్‌ఆర్‌సీ(నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్) మండలాధ్యక్షుడిగా కామ్రె తిరుపతిని నియమించినట్లు ఆ సంఘం జాతీయఅధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం జగిత్యాలలో జరిగిన నేషనల్ మీట్‌లో తిరుపతిని ఎన్నుకున్నట్లు తెలిపారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

బెజ్జూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని డీసీఆర్బీ సీఐ కేశవ్ అన్నారు. మంగళవారం రాత్రి చిన్నసిద్ధాపూర్ గ్రామస్థులకు కళాజాతాబృందం మత్తుపదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్థులు గుడుంబా, మద్యానికి బానిసకావద్దని గ్రామంలో గుడుంబా, మద్యం విక్రయాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎలాంటి సమస్యఉన్నా డయల్100కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో బృందం సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి


సరుకులు పరిశీలిస్తున్న తహసీల్దార్ భూమేశ్వర్

బెజ్జూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ భూమేశ్వర్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల వంటగది, స్టాక్‌రూంను పరిశీలించారు. వసతిగృహాల్లో పరిశుభ్రత పాటించి విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు గుణాత్మక విద్య అందించాలని సూచించారు. పాఠశాలలో భోజనవసతిపై విద్యార్థులను అడిగితెలుసుకున్నారు.

ఇటీవల వసతిగృహాల్లో తరుచూ జరుగుతున్న ఘటనలు దృష్టిలో పెట్టుకుని పరిసరాలను పరిశుభ్రత పాటించాలని ఎస్‌వో అరుణకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో గౌరీశంకర్ ఉన్నారు.

బాల్య వివాహాలు సామాజిక దురాచారం

సిర్పూర్(టి), డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు సామాజిక దురాచారమని జిల్లా బాలల సంరక్షణ విభాగం సోషల్‌వర్కర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల సంరక్షణ విభాగం, చైల్డ్‌హెల్ప్‌లైన్ ఆధ్వర్యంలో బాల్య వివాహ్‌ముక్త్ భారత్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల బాలల విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధి, భవిష్యత్‌పై ప్రభావం పడుతుందన్నారు. బాల్య వివాహాలను అడ్డుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యార్థి దశ నుంచే బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సదాశివుడు, సూపర్‌వైజర్ ఝాన్సీరాణి, పితాంబర్, తిరుపతమ్మ, ఉపాధ్యయులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సోషల్ వర్కర్ ప్రవీణ్‌కుమార్

బస్టాండు లేక ప్రయాణికుల పాట్లు

- పట్టించుకోని అధికారులు, పాలకులు



దహెగాం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బస్టాండు లేకపోవడంతో ప్రయాణికులకు పాట్లు తప్పడం లేదు. మండల కేంద్రానికి విద్యార్థులు చదువు కోసం, ప్రజలు, ఉద్యోగులు అవసరాల నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. 30కిలోమీటర్ల దూరం నుంచి మొట్లగూడ, రావులపల్లి, దిగిడ, లోహ, శంకరాపురం గ్రామాల నుంచి ప్రజలు మండల కేంద్రానికి వచ్చి బెల్లంపల్లి, కాగజ్‌నగ్, ఆసిఫాబాద్ పట్టణాలకు ప్రయాణం చేస్తుంటారు. కానీ మండల కేంద్రంలో బస్టాండు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కిరాణ దుకాణాలు, హోటళ్ల వద్ద బస్సుల కోసం వేచి ఉండాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వజూనియర్ కళాశాలకు నిత్యం వందమంది విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. కానీ వారికి బస్సు కోసం వేచి ఉందామంటే సరైన షెల్టర్ లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మండలకేంద్రంలో బస్టాండును నిర్మించాలని కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం
-దుర్గం మంజుల, విద్యార్థిని



మంలకేంద్రంలో బస్టాండు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. చెట్లు, దుకాణాలు, హోటళ్ల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా మహిళలు చాలా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

ఎవరూ పట్టించుకోవడం లేదు
- గుర్లె తారాబాయి, ఇట్యాల



అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో బస్టాండు నిర్మాణానికి నోచుకోవడం లేదు. బస్టాండు లేక పోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. మహిళలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బెజ్జూరులో సీఎం కప్ పోటీలు ప్రారంభం


బెజ్జూరులో విజేతలతో అధికారులు, నాయకులు

బెజ్జూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ సెకండరీ పాఠశాలలో బుధవారం మండలస్థాయి సీఎంకప్ పోటీలు ప్రారంభమయ్యాయి. క్రీడలను బెజ్జూరు తహసీల్దార్ భూమేశ్వర్ ప్రారంభించారు. మండలస్థాయిలో పలుపాఠశాలల విద్యార్థులు పోటీపడగా ఓవర్‌కామర్స్ పాఠశాల విద్యార్థులు మొదటిస్థానంలోనిలిచి ప్రతిభకనబర్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో గౌరీశంకర్, ఎంఈవో సునీత, నాయకులు శ్రీవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఏఈకి సన్మానం

కెరమెరి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల విద్యుత్‌శాఖ ఏఈగా పనిచేసి బదిలీపై వెళ్తున్న శ్రీని వాస్‌ను బుధవారం విద్యుత్‌శాఖ కార్యాలయంలో సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఈరమేష్, సిబ్బంది ఆలమ్ తదితరులు పాల్గొన్నారు.



రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలి


మాట్లాడుతున్న సేఫ్టీ కన్వీనర్, కార్పొరేట్ జీఎం శ్రీనివాసరావు

కాసిపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గనుల్లో కార్మికులు రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని సేఫ్టీ కన్వీనర్, కార్పొరేట్ జీఎం శ్రీనివాసరావు అన్నారు. బుధవారం కాసిపేట 2వ గనిలో నిర్వహించిన రక్షణ వారోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సింగరేణిలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు రక్షణలో భాగస్వా ములు కావాలన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించినప్పుడు సంస్థ మనుగడ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో మందమర్రి జీఎం దేవేందర్, జీఎం సేఫ్టీ రఘుకుమార్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, మందమర్రి ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల కోసం అదనపు వసతులు

శ్రీరాంపూర్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గతంలో ఉన్న వాటికంటే ఉద్యోగులకు అదనంగా వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు జీఎం ఎల్‌వి సూర్యనారాయణ అన్నారు. ఆధునీకరించిన లావిభాగం కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సంస్థ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం ఎన్ సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కె వెంకటేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు సంఘం నాయకులతో స్ట్రక్చర్ సమావేశం

శ్రీరాంపూర్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గుర్తింపుసంఘం ఏఐటీయూసీ నాయకులతో ఏరియా జీఎం ఎల్‌వి సూర్యనారాయణ బుధవారం జీఎం కార్యాల యంలో స్ట్రక్చర్ సమావేశం నిర్వహించారు. యూనియన్ నాయకులు సూచించిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని జీఎం పేర్కొన్నారు. కావాల్సిన ఏర్పాట్లను ఆయాగనులు, విభాగాల అధికారులు చేయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, శ్రీరాంపూర్ ఓసీపీ పీవో టి శ్రీనివాస్, ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, ఆనంద్ కుమార్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ దేవేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రక్షణ సూత్రాలను ప్రతి ఒక్కరూ పాటించాలి

శ్రీరాంపూర్ జీఎం సూర్యనారాయణ

జైపూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు రక్షణ సూత్రాలను పాటించాలని శ్రీరాంపూర్ జీఎం సూర్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం ఇందారం ఓసీపీలో 55వ వార్షిక రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా రక్షణ పక్షోత్సవాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా ప్రతి ఒక్కరు రక్షణతో కూడిన విధులను నిర్వహించాలన్నారు.

రక్షణ పక్షోత్సవాల ఇన్‌స్పెక్షన్ కమిటీ అన్ని విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యో గుల పని విధానాన్ని ప్రత్యక్షంగా తనిఖీచేసి వారు తీసుకుంటున్న చర్యలను గమనిస్తుం దన్నారు. కార్యక్రమంలో కార్పొరేట్ జీఎం, ఆర్‌అండ్‌డీ నారాయణరావు, అధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీధర్‌రావు, ఏవీరెడ్డి, నాగన్న, కృష్ణరావు, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

పాన్‌కార్డు అనుసంధాన సమస్యను పరిష్కరించుకోవాలి

శ్రీరాంపూర్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులు పాన్‌కార్డు అనుసంధాన సమస్యను పరిష్కరించుకోవాలని యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ఆదాయపు పన్నుచట్టం ప్రకారం నిర్ణీతఆదాయం ఉన్న వారు ఆదాయపు పన్నురిటర్న్ దాఖలు చేసుకోవాలనే నిబంధన 2011నుంచి అమలులో ఉందన్నారు. దీని ప్రకారం పాన్ కార్డు, ఆధార్ కార్డు అనుసంధానం చేసుకోవాలన్నారు. కానీ కొందరు ఉద్యోగులు 2023-24ఆర్థిక సంవత్సరములో ఆపనిచేయకపోవడంతో వారి పాన్‌కార్డులు ఇన్ ఆపరేటివ్‌గా పరిగణించి అపరాధ రుసుము వసూలుకు ఆదాయపు పన్నుశాఖ ఆదేశాలు జారీచేసింది. ఆడబ్బును యాజమాన్యం చెల్లించింది. ఆ సొమ్మును ఉద్యోగుల వేతనాల నుంచి రికవరీ చేస్తున్నారు. అయినా సదరు ఉద్యోగులు అనుసంధానం చేసుకోవడం లేదు. వీరంతా 2023-24ఆర్థిక సంవత్సరం రీఫండ్‌కు అర్హత పొందాలన్నా, 2024-25ఆర్థిక సంవత్సరం అపరాధ రుసుము తప్పించుకోవాలన్నా ఈనెల 31వ తేదీలోగా రివైజ్డ్ రిటర్న్, బిలేటెడ్ రిటర్న్ ఫైలింగ్, పాన్‌కార్డ్, ఆధార్‌కార్డు అనుసంధానం చేసుకోవాలని ఒక ప్రకటనలో కోరారు.

సమష్టి కృషితోనే ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించవచ్చు

కాసిపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితోనే ఉత్పత్తిలక్ష్యాలను అధిగమించవచ్చని మందమర్రి జీఎం దేవేందర్ అన్నారు. బుధవారం కాసిపేట 1వగనిలో నిర్వహించిన మల్టీడిపార్టుమెంటల్ సమావేశానికి హాజరై మాట్లాడారు. ఉత్పత్తి ఉత్పాదకతలో కార్మికులందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్మికులందరు ఉత్పత్తిలక్ష్యాలను సాధించాలన్నారు. అనంతరం కార్మికులు, అధికారులు ఉత్పత్తి ప్రతిజ్ఞచేశారు. కార్యక్రమంలో అధికారులు విజయప్రసాద్, వెంకటరమణ, ప్రసాద్, రాజన్న, ఆసిఫ్, నాయకులు పాల్గొన్నారు.

భూ కబ్జాపై విచారణ ఎప్పుడు..?

5వ పేజీ తరువాయి..

మండల అధికారులు అదనంగా మరో 10 రోజులు గడుస్తున్నా కబ్జాకు గురైన స్థలంలో ఇప్పటి వరకు సర్వే కూడా జరుపకపోవడం కొసమెరుపు.


ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

భూములను కాపాడాలని..

జిల్లా కలెక్టర్ ఆదేశాలను కిందిస్థాయి అధికారులు అమలు చేయక పోవడం, కబ్జాకు గురైంది గిరిజన భూములు కావడంతో గ్రామస్థులు బుధవారం ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు చేశారు. ముత్యంపేట గ్రామం ఏజెన్సీ ఏరియా కావడంతో రైస్ మిల్లు ఏర్పాటు చేసిన గిరిజన భూములను కాపాడాలని కోరుతూ ఐటీడీఏ డైరెక్టర్ మర్సుకోల బాపురావు స్థానికులతో కలిసి ఉట్నూరులోని ప్రాజెక్టు ఆఫీసర్ ఖుష్బూ గుప్తాకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. గిరిజన చట్టాలను తుంగలో తొక్కుతూ గిరిజనేతరులు ఏజెన్సీ ప్రాంతంలో ఇష్టారీతిన భూముల కబ్జాలకు పాల్పడుతున్నారని, పీవో స్పందించి గిరిజనుల భూములను కాపాడడంతో పాటు కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సర్వేయర్ అందుబాటులో లేకనే....

ముత్యంపేట గ్రామంలో గిరిజన భూముల్లో అక్రమంగా ఏర్పాటు చేసి న రైస్ మిల్లు విషయంలో పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని అదనపు కలెక్టర్ నుంచి ఆదేశాలు ఉన్నాయి. భూముల్లో సర్వే చేయాల్సిన మండల సర్వేయర్‌ను ఉన్నతాధికారులు ఇతర పనుల నిమిత్తం హాజీపూర్ మండ లానికి డిప్యుటేషన్‌పై పంపారు. ఈ కారణంగా విచారణ చేపట్టడంలో కొంత ఆలస్యం జరిగింది. సర్వేయర్ తిరిగి విధుల్లో చేరగానే గిరిజన భూముల్లో విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాం.

- సంధ్యారాణి, దండేపల్లి తహసీల్దార్

మంచిర్యాలలో వందే భారత్ రైలును నిలుపాలి


కేంద్రమంత్రికి కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో సికింద్రాబాద్-నాగ్‌పూర్ మధ్య నడుస్తున్న వందే భారత్ రైలును నిలుపాలని కోరుతూ బుధవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి బీజేపీ జిల్లాఅధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి వినతి పత్రం అందించారు. మంచిర్యాల రైల్వే స్టేషన్‌కు ఎన్‌ఎస్‌జీ 4 జాబితాలో 30వ స్థానం ఉందని, అత్యధిక ఆదాయం వస్తుందని తెలిపారు. మంచిర్యాలలో రైలు నిలిపివే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. మంచిర్యాల రైల్వే స్టేషన్ నుంచి నాగ్‌పూర్‌కు, సికింద్రా బాద్‌కు ప్రతి రోజు వేల మంది ప్రయాణం చేస్తుంటారని తెలిపారు. రైలు మంచిర్యాలలో నిలిచేలా చూడాలని విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్‌రావు, ముఖేష్‌గౌ డ్, రవీందర్‌రావు, మురళీధర్, జయరామారావు పాల్గొన్నారు.

వ్యవసాయ విస్తరణ అధికారులకు శిక్షణ ఇస్తాం

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో 11వ ప్రపంచ వ్యవసాయ గణన నిర్వహించేందుకు వ్యవసాయ విస్తరణ అధికారులు, పర్యవేక్షణ అధికారులకు శిక్షణ ఇవ్వనున్నామని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి మహ్మద్ ఖాసీం అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా శిక్షకుడు, హాజీపూర్ ఎంపీఎస్‌వో మోహన్ ద్వారా శిక్షణ అందించనున్నామని తెలిపారు. రెవెన్యూ గ్రామ యూనిట్‌గా తీసుకుని సర్వే న ంబర్ల వారీగా పంట సాగు వివరాలు, నీటి పారుదల, రైతు సామాజిక ఆర్థిక స్థితి గతులను , పనిముట్లు, ఎరువులు, ఇతర వివరాలను మొబైల్ యాప్ ద్వారా నమోదు చేయాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టంగా వివరాలను నమోదు చేయాలన్నారు. మొదటి దఫాలో మంచిర్యాల జిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచేందుకు పాటుపడిన అధికారుల కృషి అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కల్పన, జిల్లా గణాంక అధికారి సత్యం, ఉపగణాంక అధికారులు, నోడల్ అధికారులు, ఏఈవోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి గణిత ప్రతిభా పరీక్షలు


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

మంచిర్యాల అర్బన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీరామానుజన్ జయంతిని పురస్కరించుకొని జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా జిల్లా విద్యాశాఖ, తెలంగాణ గణిత ఫోరం మంచిర్యాల జిల్లా విభాగం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో సైన్స్ కేంద్రంలో గణిత ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ప్రభుత్వ, కేజీబీవీ, రెసిడెన్షియల్ పాఠశాలల నుంచి 90 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగు మీడియం విభాగంలో బివిజయలక్ష్మి, జె శ్రీవాణి (జడ్పీఎస్ఎస్, బాదంపల్లి, జన్నారం), ఏ రాంచరణ్ (జడ్పీఎస్ఎస్, జైపూర్), ఇంగ్లీష్ మీడియం విభాగంలో షేక్ అశ్వక్ (జడ్పీఎస్ఎస్, కలమడుగు, జన్నారం), అకుల అన్వేష్ (జడ్పీఎస్ఎస్, కిష్టాపూర్), జె కార్తీక్ (జడ్పీఎస్ఎస్, బజార్ ఏరియా, బెల్లంపల్లి), రెసిడెన్షియల్, ఆదర్శ పాఠశాల నుంచి ఎన్ చరణ్ (మోడల్ స్కూల్, మంచిర్యాల), విశ్వరూప్ (మోడల్ స్కూల్, మందమర్రి), కె.చరణ్ (ఎంజేపీబీసీ డబ్ల్యూఆర్, హాజీపూర్)లు పరీక్షల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. పరీక్షల అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో మాళవిక దేవి, జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, సెక్టోరియల్ అధికారులు చౌదరి, సత్యనారాయణ మూర్తి, శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి మధు బాబు, తెలంగాణ గణిత ఉపాధ్యాయుల ఫోరం జిల్లా అధ్యక్షులు ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియా వ్యాధిగ్రస్థుల గుర్తింపు

గర్మిళ్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలోని 28వ వార్డులో బుధవారం ఫైలేరియా వ్యాధిగ్రస్థుల గుర్తింపు కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ ప్రారంభించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలో 18 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 5,400 రక్త నమూనాలను సేకరించడం కోసం 108 టీంలను ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్‌లు అనిత, శివ ప్రతాప్, అమన్, నాందేవ్, జగదీష్, అధికారులు అల్లాడి శ్రీనివాస్, వెంకటేశ్వర్, దీక్షిత రాణి పాల్గొన్నారు.

మామిడిలో పూత దశే కీలకం



మామిడి పూత సాధారణంగా డిసెంబరు, జనవరి నెలల్లో మొదలై ఫిబ్రవరి వరకు పూస్తుంది. ఎనిమిది నెలల పాటు చేపట్టే యాజమాన్య పద్ధతులు ఒక ఎత్తయితే పూత నుంచి కోత వరకు నాలుగు నెలల పాటు చేపట్టే పద్ధతులు మరో ఎత్తు. మామిడిలో పూతంతా ఒకేసారి రాదు. పూత ఒకేసారి రాకపోవడంతో సస్యరక్షణ చర్యలు చేపట్టడంలో, కోత కోయడంలో రైతులకు ఇబ్బందులు ఎదురవుతాయి.


నెన్నెల మండలం మన్నెగూడెంలో మామిడి రైతులకు సూచనలు ఇస్తున్న అధికారులు(ఫైల్)

- ప్రతికూలంగా వాతావరణం
- రోజుల తరబడి మబ్బులతో రైతుల్లో గుబులు
- సస్యరక్షణ చర్యలు చేపడితేనే మేలు


నెన్నెల మండలం చిత్తాపూర్‌లో మామిడి చెట్లకు మందులు పిచికారీ చేసుకుంటున్న రైతులు

నెన్నెల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మామిడి పంటలో పూత దశనే కీలకం. మామిడి చెట్లు పూతకు వచ్చే ప్రస్తుత తరుణంలో వాతావరణం ప్రతికూలంగా ఉంది. రోజుల తరబడి మబ్బులు పట్టడం, పొగమంచు కమ్ముకోవడంతో పూతపై తీవ్ర పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే పూత రావడంతో పాటు ఆశించిన దిగుబడులు సాధించవచ్చని నిపుణులు చెబుతున్నారు. డిసెంబరు రెండు, మూడోవారం నుంచి మామిడి చెట్లు పూతకు వస్తాయి కాబట్టి ఇప్పటి నుంచే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మామిడలో సోకే తెగుళ్లపై అవగాహన పెంచుకుని వాటిని గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేస్తున్నారు.

- మామిడిలోపూత దశలో నీటి తడులు నిలిపి వేసి బెట్ట పరిస్థితులు కల్పిస్తే శాఖీయ పెరుగుదల నిలిచిపోయి మొక్కకు తగినంత విశ్రాంతి లభిస్తుంది. దీని వల్ల చెట్టు పూత సమయానికి సరిపడ పిండి పదార్థం నిల్వ చేసుకోవడమే కాకుండా కొమ్మలు పూర్తి పక్వతకు చేరుకుని ఎక్కువ పూత రావడానికి దోహదపడతాయి.
- పూమొగ్గ ఏర్పడిన తరువాత నీటితడులిచ్చి పైపాటుగా ఎరువులు వేసుకోవాలి. చెట్టు వయసును బట్టి సాధారణంగా 500 గ్రాముల నుంచి ఒక కిలో యూరియా, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను వేయాలి.
- పూత విచ్చుకున్న తరవాత పిందె కట్టేందుకు తేనెటీగలు, ఈగల ద్వారా పరప రాగ సంపర్కం జరుగుతుంది. ఇలాంటి సమయంలో ఎలాంటి క్రిమీ సంహారక మందులు పిచికారీ చేయరాదు. ఒక వేళ చేస్తే సపర్కానికి దోహదపడే తేనెటీగలు, ఈగలు పూత దరి చేరక పిందె కట్టడం ఆగిపోతుంది. అందువల్ల క్రిమి సంహారక మందులన్నీ పచ్చిపూత దశలోనే, పిందె కట్టిన తరువాతనే పిచికారీ చేసుకోవాలి.
- పూత ఆలస్యం అయిన చెట్లపై మల్టీకె 10 గ్రాములు, యూరియా 5 గ్రామలు ఒక లీటరు నీటికి కలిపి చెట్టుపై పిచికారి చేయాలి. బోరాన్ లోపం ఉన్న తోటల్లో బోరాక్స్ 2 గ్రాములు చొప్పున ఒక లీటరు నీటికి కలిపి స్ప్రే చేస్తే పిందెకట్టు పెరుగుతుంది.
- పూత సమయంలో తేనె మంచు పురుగు, తామరు పురగు, ఆకుచుట్టు, పూత చుట్టు, పిండి నల్లి పురుగులు నష్టాన్ని కలిగిస్తాయి. ఆకుజల్లెడ పురుగు (బల్లి పాతర) చెట్లపై లేకుండా చూసుకోవాలి. తెగుళ్ల ఆశించినట్లు గుర్తించిన వెంటనే తగిన మందులు స్ప్రే చేయాలి.

● తేనెమంచు తెగులు

తేనె మంచు పురుగుల నివారణకు డైమిథియోట్ 2 మిల్లీ లీటర్లు లేదా 3 గ్రాముల కార్బోరిల్ చొప్పున కలిపి చెట్టంతా తడిసేలా పిచికారీ చేయాలి. పిందెలు బటాని గింజ సైజులోకి వచ్చాక లీటరు నీటికి ఒక మిల్లీ లీటరు పాస్ఫోమిడాన్ లేదా 2 మిల్లీ లీటర్ల మిథైల్ డెమటాన్ లేదా డైమిథోయెట్ లలో ఏదో ఒక మందుకు ఒక గ్రాము ఎసిఫేట్ కలుపుకుని పిచికారి చేసుకోవాలి.

● తామరపురుగులు

తామరపురుగుల నివారణకు లీటరు నీటికి 1 గ్రాము ఎసిఫేట్ లేదా ఒక మిల్లీ లీటరు పాస్ఫోమిడాన్ లేదా 2 మిల్లీ లీటర్ల రిజెంట్ చొప్పున ఒక లీటరు నీటికి కలిపి స్ప్రే చేసుకోవాలి.

● బూడిద తెగులు

చల్లని రాత్రులు, వేడి వాతావరణంలో పూత, పిందెపై తెల్లని పొడి లాంటి బూజు ఏర్పడుతుంది. ఈ శిలీంధ్రం ఆశిస్తే పూత, పిందెలు రాలిపోతాయి. ఈ తెగులు నివారణకు లీటరు నీటటికి 3గ్రాముల గంధకం (వెటబుల్‌సల్ఫర్) కలిపి పిచికారి చేయాలి. హెక్స కోనా జోల్ లీటరు నీటికి 2మిల్లీలీటర్లు కలిపి స్ప్రే చేసుకోవాలి.

● ఇతర తెగుళ్లు

ఆకుజల్లెడ, ఆకుమచ్చ, పూతమాడు, నల్లమచ్చ తెగుళ్లు కూడా మామిడి చెట్లపై దాడి చేస్తాయి. ఈ తెగుళ్ల వల్ల దిగుబడిపై ప్రభావం పడుతుంది. తెగుళ్ల నివారణకు లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సి క్లోరైడ్, 2.5 గ్రాముల మాంకోజెబ్ కలిపి పిచికారి చేయాలి. సస్యరక్షణ చర్యలు చేపడుతూనే ఎండలు ముదురుతున్నా కొద్ది క్రమం తప్పకుండా నీటి తడులు ఇస్తే మామిడిలో పూత, పిందె రాలకుండా ఉంటుంది.

● పిందెరాలడం.. నివారణ చర్యలు

పిందె కట్టిన నాటినుంచి కాయ కోత వరకు అనేక కారణాల వల్ల మూడు దశల్లో పిందెలు కాయలు రాలుతుంటాయి. పిందెలు రాలకుండా ఉండేందుకు చెట్లకు 20-30 రోజుల వ్యవధిలో రెండు, మూడు సార్లు నీటితడులివ్వాలి. సాగునీటి సౌకర్యం లేని వారు యూరియా ద్రావణాన్ని పిచికారి చేసుకోవాలి. రాలుడు ఉధృతి ఎక్కువగా ఉంటే 4.5 లీటర్ల నీటిలో 1 మిల్లీ లీటరు ప్లానోఫిక్స్ కలిపి మొదటి సారి పిందెలు గోలికాయల సైజులో ఉన్నప్పుడు, నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు రెండోసారి స్ప్రే చేయాలి. మల్టీకె (13-0-45) 10 గ్రాముల నీటిలో కలిపిన ద్రావణాన్ని పిచికారి చేసుకుంటే ఆశించిన దిగుబడులు సాధించవచ్చు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



దిగుబడులు సాధించడంలో పూతదశనే కీలకం. యాజమాన్య పద్ధతులు పాటిస్తే చెట్లు పూతకు వస్తాయి. తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టి వచ్చిన పూతను కాపాడుకోవాలి. మబ్బులు కమ్ముకొని ఉండడంతో చీడ పీడల ఉధృతి పెరిగే అవకాశం ఉంది. పూత ఆలస్యంగా వచ్చినపుడు కాయ పెరుగుదల దశలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండి పొడి వాతావరణం ఉంటుంది. దీని వల్ల రసం పీల్చే పురుగులు ఎక్కువగా ఆశించి నష్ట పరిచే అవకాశం ఉంటుంది. రైతులు తమకు తోచిన మందులు పిచికారి చేసి నష్టపోకుండా ఉద్యాన అధికారులను సంప్రదించాలి.

- అరుణ్‌కుమార్, బెల్లంపల్లి క్లస్టర్ ఉద్యాన అధికారి

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు

- వీడియోకాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి


వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ కుమార్‌దీపక్, అధికారులు

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గూడు లేని నిరుపేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు కృషి చేస్తోందని, ఈ క్రమంలో అర్హత గల వారిని గుర్తించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.హైదరాబాద్ నుంచి బుధవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్, పోలీసు, అధికారులతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు అర్హులకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఈ క్రమంలో ఈ నెల 5వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్ల యాప్ ఆవిష్కరించామని తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 80 లక్షల దరఖాస్తులు అందాయని చెప్పారు. ఈ దరఖాస్తులకు సంబంధించి సర్వే నిర్వహించను న్నామని చెప్పారు. ఇందులో దరఖాస్తులు పూర్తి వివరాలతో యాప్‌లో నమోదు చేసి అర్హత గల వారికి ఇళ్లు మంజూరు చేయనున్నామని తెలిపారు. ప్రతి 500 ఇళ్లకు ఒక సర్వేయర్‌ను కేటాయించామని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులతో కలిసి 10 నుంచి 20 రోజుల్లోగా సర్వే ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సర్వే నిర్వహించే ప్రాంతాల్లో ఒక రోజు ముందుగా దండోరా వేయించాలన్నారు. టీజీపీఎస్‌సీ చైర్మన్ మాట్లడుతూ నిరుద్యోగ యువతకు నోటిఫికేషన్‌ల ద్వారా ఉద్యోగాలు కల్పించనున్నామని తెలిపారు. ఈ నెల 15,16 తదేఈల్లో గ్రూప్ 2 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లడుతూ గ్రూప్ 2 పరీక్ష కోసం జిల్లాలో 8 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. అభ్యర్థులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశామని చెప్పారు. 14,951 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. కార్యక్రమంలో డీసీపీ భాస్కర్, పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మె


కలెక్టరేట్ ఎదుట శిబిరంలో కూర్చున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

నస్పూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో 15ఏళ్లుగా పని చేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేపట్టారు. ఇందులో భాగంగా నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట బుధవారం నిరసనల్లో భాగంగా మానవహారం నిర్వహించారు. ఉద్యోగులు చేపట్టిన సమ్మెకు పలు ఉపాధ్యాయ సంఘాలు, ప్రైవేట్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఏ-జెఏసీ జిల్లా అధ్యక్షురాలు సుమలత, కార్యదర్శి రాజన్న మాట్లాడుతూ డిమాండ్లు పరిష్కరించాలని ఆరో తేదీ నుంచి 9వ తేది వరకు నిరసన కార్యక్రమాలను నిర్వహించా మన్నారు. 10వ తేది నుంచి సమ్మె ప్రారంభించామన్నారు. మంగళ వారం విద్యాశాఖ, తమ యూనియన్ నేతల మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చమని అడుగుతున్నామని చెప్పారు. తమకు సహకరిస్తే అధికారంలోకి వచ్చిన తర్వాత క్రమబద్ధీకరిస్తామని ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అప్పుడు హామీ ఇచ్చారన్నారు. ఆనాడు ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా పట్టించుకోలేదని వాపోయారు. దీన్ని నిరసిస్తూ తాము సమ్మెను ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి సుమన, కార్యదర్శి దేవేంద్ర, నాయకులు జనార్థన్, నగేష్, కవిత, ఫణిబాల, కనకలక్ష్మి, కవిత, మూర్తి, రాకేష్, శ్రీధర్, ముఖేష్, రాంబాబు, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఉద్యోగుల సమ్మెకు ట్రస్మా జిల్లా అధ్యక్షుడు అజీజ్, నాయకులు ఉపేందర్, దేవన్న మద్దతు తెలిపారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాల అర్బన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌ను ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్నామని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని రామగుండం కమీషనర్ ఆఫ్ పోలీస్ ఎం.శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీపడదగిన కేసుల్లో పరస్పరం సహకరిచుకోవాలని సూచించారు. రాజీ మార్గమే రాజ మార్గమని, చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకొని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దని తెలిపారు. . పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్స్, పోలీస్ సిబ్బంది రాజీపడదగిన కేసులను గుర్తించి ఇరు వర్గాల వారిని పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించాలని సూచించారు.

న్యూస్ బాక్స్

బాధ్యతల స్వీకరణ

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్‌ఖాన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. కాగా ముఖ్య ప్రణాళిక అధికారిగా జి.సత్యం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా గణాంక అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సత్యం ప్రస్తుతం ముఖ్య ప్రనాళిక అధికారిగా పనిచేస్తున్న మహ్మద్ ఖాసీం నుంచి బాధ్యతలు స్వీకరించారు.

యువత వ్యసనాలకు బానిస కావొద్దు

నెన్నెల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): యువత వ్యసనాలకు బానిస కావొద్దని సీఐ అఫ్జలుద్దీన్ అన్నారు. నెన్నెల మండలం మన్నెగూడంలో బుధవారం పోలీస్ కళాబృందం వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించింది. బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, నెన్నెల ఎస్సై ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, బాల్య వివాహాలు, మూఢ నమ్మకాలు, హత్యలు, ఆత్మహత్యలు, లైంగిక వేధింపులు, గంజాయి, గుండుంబా, జూదంతో జరిగే అనర్థాలపై ఆట పాటల రూపంలో వివరించారు. షీటీమ్, డయల్ 100, అభయ యాప్‌ల గూర్చి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనాలు నడిపే వారు తప్పకుండా అన్ని ధ్రువ పత్రాలు కలిగి ఉండాలన్నారు. బైక్ డ్రైవింగ్‌లో హెల్మెట్ తప్పక ధరించాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సీఐ కోరారు.

నేడు సీఎం కప్ మండల స్థాయి పోటీలు

కన్నెపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కన్నెపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించనున్నామని ఎంపీడీవో శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, యువకులు క్రీడల్లో పాల్గొనాలని సూచించారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కాసిపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించి నాణ్యమైన భోజనం అందించాలని బీజేపీ మండల అధ్యక్షుడు సూరం సంపత్ అన్నారు. బుధవారం మండలంలోని మల్కేపల్లి ఆశ్రమ పాఠశాలను సందర్శించి మాట్లాడారు. చలికాలంలో విద్యార్థులకు దుప్పట్లు లేక అవస్థలు పడుతున్నారన్నారు. ఇటీవల నాణ్యమైన భోజనం లేక విద్యార్థులు రోగాల బారిన పడి మృతిచెందుతున్నారని నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అనంతరం తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొను గోలు చేయాలన్నారు. ప్రభుత్వం ఈమేరకు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు శంకరయ్య మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకే కార్డన్‌సెర్చ్

కాసిపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణకే కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నామని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి అన్నారు. బుధవారం మల్కేపల్లిలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ నేరాల నియంత్రణ కోసమే కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల రక్షణే పోలీసుల బాధ్యత అన్నారు. ప్రజలందరు పోలీసులకు సహకరించాలన్నారు. గ్రామాల్లోకి ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి వాహనదారులు వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ చదువులో రాణించాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ నంబర్లు అడిగితే చెప్పవద్దన్నారు అనంతరం సరైన వాహన పత్రాలు లేని 43 బైక్‌లు, 3 ఆటోలను సీజ్ చేశారు. కార్యక్రమంలో దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు, కాసిపేట, మందమర్రి, రామకృష్ణపూర్ ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐ శశిధర్‌రెడ్డి



రేపటి నుంచి కవ్వాల టైగర్‌జోన్‌లో బర్డ్‌వాచ్

జన్నారం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కవ్వాల టైగర్ జోన్‌లో యేటా నిర్వహించే బర్డ్‌వాచ్ శుక్రవారం, శనివారం నిర్వహించనున్నట్లు ఎఫ్‌ఆర్‌వో సుష్మారావు తెలిపారు. కవ్వాల టైగర్ జోన్‌లో నిర్వహించే బర్డ్‌వాచ్ రెండు రోజుల పాటు నిర్వహిస్తామని అన్నారు. శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి బర్డ్‌వాచ్‌లో పాల్గొనే వారికి రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. శనివారం ఉదయం 5.30 గంటలకు బర్డ్‌వాచ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు టీడీసీలో భోజన వసతి కల్పించి ముగిస్తామని తెలిపారు.

అర్హులను గుర్తించాలి

కాసిపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో అర్హులను గుర్తించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని కోమటిచేను, కొండాపూర్, కోనూరు, దేవాపూర్ గ్రామాల్లో ఆయన పర్యటించి సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో పకడ్బందీగా నిర్వహించి అర్హులైన వారి జాబితాను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం సెగ్రిగేషన్ షెడ్లను పరిశీలించారు. ఈ నెలాఖరులోగా వంద శాతం పన్నులను వసూలు చేయాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఆయన వెంట ఎంపీవో సప్దర్ అలీ, కార్యదర్శులు ఉన్నారు.

దాడి చేయడం సరికాదు

వేమనపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేటలో భూ బాధితుడికి మద్దతు తెలుపడానికి వెళ్లిన తీన్మార్ మల్లన్న టీంపై దాడి చేయడం సరైంది కాదని తీన్మార్ మల్లన్న టీం వేమనపల్లి మండల అధ్యక్షుడు చునర్కర్ మల్లేష్ ఒక ప్రకటనలో తెలిపారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అయ్యప్పదాసుకు దర్మ సేవా రత్న అవార్డు

శ్రీరాంపూర్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ ధర్మ ప్రచార సభ(ఏబీఏపీ) జాతీయ అధ్యక్షుడు అయ్యప్పదాసుకు మహారాష్ట్ర ప్రభుత్వం దర్మ సేవా రత్న అవార్డును అందించింది. ఆ రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్ ముంబైలోని శంకరాలయం 58వ వార్షికోత్సవంలో ఈ అవార్డును అందించడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

భూ కబ్జాపై విచారణ ఎప్పుడు..?

- అక్రమంగా మినీ రైసుమిల్లు ఏర్పాటు
- కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్
- ప్రభుత్వ స్థలాన్ని కాపాడడంలో తాత్సారం
- కబ్జా కోరులకు రెవెన్యూ అధికారుల వత్తాసు
- తాజాగా ఐటీడీఏ పీవోకు గ్రామస్థుల ఫిర్యాదు

మంచిర్యాల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గిరిజన (ఏజెన్సీ) భూములను కబ్జా చేయడమే గాకుండా, అందులో అక్రమంగా ఏర్పాటు చేసిన రైలు మిల్లుపై విచారణ జరపడంలో మండల అధికారులు కావాలనే తాత్సారం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కబ్జా కోరులు జాగ్రత్త పడేందుకు అవకాశం ఇచ్చేలా విచారణను నత్తనడకన చేపడుతున్నట్లు బాహాటంగా ప్రచారం జరుగుతోంది. 'ఏజెన్సీ భూమి కబ్జా' శీర్షికన నవంబరు 12న 'ఆంధ్రజ్యోతి' జిల్లా అనుబంధంలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దండేపల్లి మండలం ముత్యంపేట గ్రామం పూర్తిగా ఏజెన్సీ ప్రాంతంలో ఉంది. ఇక్కడ గిరిజన చట్టాలైన 1/70, పేసా చట్టాలు అమలులో ఉన్నాయి. అయినప్పటికీ గిరిజనేతరుడైన ఓ బడా వ్యాపారి గ్రామ శివారులో ఎకరం భూమిని కబ్జాచేసి అందులో ఏకంగా రైస్‌మిల్లు నిర్మించాడు. సదరు భూముల బహిరంగ మార్కెట్ విలువ రూ. కోటి పై చిలుకు ఉండగా కబ్జా పర్వాన్ని ఆంధ్రజ్యోతి కథనం ద్వారా వెలుగులోకి తెచ్చింది.

కబ్జా జరిగిందిలా..

దండేపల్లి మండలంలోని కొర్విచెల్మ నివాసి ముద్దసాని వేణు ముత్యంపేట గ్రామంలో సర్వే నంబరు 17లో 34 గుంటలతోపాటు దాని సమీపంలోని సర్వే నెంబరు 18లో మరో ఆరు గుంటల భూమిని ఆక్రమించి ఎలాంటి అనుమతులు లేకుండా, కనీసం గ్రామ పంచాయతీ ట్రేడ్ లైసెన్స్ కూడా పొందకుండా మినీ రైస్‌మిల్లు ఏర్పాటు చేశాడు. సదరు భూమిని ఉట్నూరులోని ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ ఇళ్లు లేని పలువురు గిరిజనులకు ఇంటి స్థలాల కోసం కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు. పీవో ఆదేశాలను తూచ తప్పకుండా అమలు చేయాల్సిన తహసీల్దార్ తాత్సారం చేయడతో వ్యాపారి కళ్లు స్థలంపై పడ్డాయి.

కలెక్టర్‌కు ఫిర్యాదుతో వెలుగులోకి..

గిరిజనుల భూములను గిరిజనేతరుడు కబ్జా చేసిన విషయమై పలువురు గ్రామస్థులు అక్టోబరు 28న కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో ఈ విషయమై కలెక్టర్ సూచనల మేరకు అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ నవంబరు 26న అక్రమంగా రైస్ మిల్లు ఏర్పాటు చేసిన స్థలంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని దండేపల్లి తహసీల్దార్‌ను లిఖితపూర్వకంగా ఆదేశించారు. లేఖ ఇచ్చిన నాటి నుంచి గరిష్ఠంగా ఏడు రోజుల లోపు నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఈ నెల 2లోపు తహసీల్దార్ విచారణ జరిపి, పై అధికారులకు నివేదిక సమర్పించాల్సి ఉంది. అయితే కలెక్టర్ ఆదేశాలను ఖాతరు చేయని



'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

మిగతా 7వ పేజీలో..

క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజం


కోటపల్లిలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అధికారులు

జైపూర్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజమని తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తున్న సీఎం కప్ మండల స్థాయి పోటీలను బుధవారం మండల కేంద్రంలోని గురుకుల సాంఘీక సంక్షేమ పాఠశాలలో వారు ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీధర్, ఎంపీవో శ్రీపతి బాపురావు, ఎంఈవో శ్రీనివాస్, ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు సుమన్, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోటపల్లి: క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని ఎంపీడీవో లక్ష్మయ్య కోరారు. బుధవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ మైదానంలో మండల స్థాయి సీఎం కప్ క్రీడలను ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్న అధికారులు మాట్లాడారు. అథ్లెటిక్స్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ తదితర పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేంద్రనాథ్, ఎంఈవో వెంకటేశ్వర్లు, ఎంపీవో సత్యనారాయణ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జీ కృష్ణమూర్తి, ఏపీవో బాలయ్య, పీఆర్‌టీయూ మాజీ జనరల్ సెక్రటరీ కొట్టె శంకర్, పీఈటీలు లింగన్న, రాజయ్య, వరలక్ష్మీ, శ్రీకాంత్, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

హాజీపూర్: రాంపూర్ ఆవాస విద్యారణ్య పాఠశాలలో మండల స్థాయి సీఎం కప్ పోటీలను తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోట రవి తదితరులు పాల్గొన్నారు.

జన్నారం: జన్నారంలోని జడ్పీహెచ్‌ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయి సీఎం కప్‌పోటీలను నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. మండల స్థాయిలో గెలిచి జిల్లాస్థాయికి ఎంపికైన వారిని అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎంఈవో విజయ్‌కుమార్,హెచ్‌ఎం శివరాజన్,ఉపాధ్యాయులు ప్రకాష్, పీఈటీలు యాకూబ్,సాగర్, కాంతయ్య, చరిష్మా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని ఎంపీడీవో రాజేశ్వర్ సూచించారు. బుధవారం సింగరేణి పాఠశాల మైదానంలో మండల స్థాయి సీఎం కప్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారి అనిత, తహసీల్దార్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

సీపీఐలో చేరిన మాజీ సర్పంచ్

చెన్నూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగాపూర్ గ్రామ మాజీ సర్పంచు సూత్రం నారాయణ బుధవారం సీపీఐ పార్టీలో చేరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యుడు రేగుంట చంద్రశేఖర్‌లు నారాయణకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పార్టీ శత జయంతి సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. కార్యకర్తలు పార్టీ పటిష్ఠతకు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సమ్మయ్య, పౌలు, పోచన్న, రాయమల్లు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి తగ్గదు.. వెల్లుల్లి దిగదు

- వెల్లుల్లి కిలో ధర రూ.400
- ఉల్లి ధర రూ.50పైమాటే

6



మామిడిలో పూత దశే కీలకం

- ప్రతికూలంగా వాతావరణం
- రోజుల తరబడి మబ్బులతో రైతుల్లో గుబులు
- సస్యరక్షణ చర్యలు చేపడితేనే మేలు

7



ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలి

జన్నారం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జన్నారం మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని బుధవారం నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు విద్యార్థులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ జన్నారం మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు రంజిత్,నాగేష్, మహేష్, తిరుపతి, కరుణాకర్, దివ్య, మహేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చెన్నూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): డీఎంఎఫ్‌టీ నిదులు రూ. 5 లక్షలతో మండలంలోని లంబడిప్లి గ్రామంలో బుధవారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పట్టణంలోని 34వ వార్డులో రూ. 3 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు చిట్యాల మధు, ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

చెన్నూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. బుధవారం చెన్నూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, తహసీల్దార్ మల్లికార్జున్‌తో కలిసి సందర్శించి తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్ని సౌకార్యలతో కూడిన గుణాత్మక విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. పాఠశాల పాఠశాల మైదానంలో అమృత్ 2.0 పథకం కింద మంజూరైన నీటి ట్యాంక్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. చెన్నూరు మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం తెలంగాణ సాంఘిక సంక్షేమ సంక్షేమ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలను సందర్శించి వంటశాల, నిత్యవసర సరుకులు, రిజిస్టర్‌లను పరిశీ లించారు. తరగతి గదిలో విద్యార్థినులల పఠన సామర్థ్యాలను పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ధరణి పోర్టల్‌లో అందిన దరఖాస్తులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్‌ఐ వెంకటేష్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

జర్నలిస్టుల నిరసన

చెన్నూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని జల్‌పల్లిలో టీవీ9 జర్నలిస్టు రంజిత్‌పై సినీనటుడు మోహన్‌బాబు చేసిన దాడిని ఖండిస్తూ చెన్నూరు పట్టణంలోని ప్రెస్‌క్లబ్ జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు ధరించి బుధవారం స్థానిక అంబేద్కర్ చౌక్‌లో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్ లో, తహసీల్దార్ కార్యాల యంలో వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ గౌరవాధ్యక్షుడు మధునయ్య, జర్నలిస్టులు భాస్కర్‌గౌడ్, పోచిరెడ్డి, కళ్యాణ్, ఎజాజ్, ఎల్లాగౌడ్, కరీం, రాజేందర్, కరునాకర్, కిరణ్‌కుమార్, మహేష్‌గౌడ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రకటన

[illegible]

ఇట్లు సం/- సోమల రాజ్‌కుమార్, అడ్వకేట్
రూం నెం. 15, కోర్టు కాంప్లెక్స్, మంచిర్యాల.
సెల్ : 98492 14324

జీవితాన్ని కోల్పోతున్న యువత



- అవగాహన రాహిత్యంతో నష్టాలు పాలు
- అప్పులకు వడ్డీలు కట్టలేక బలవంతపు మరణాలు
- ఏడాదిలో మంచిర్యాలలో పది మంది వరకు మృతి

మంచిర్యాల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలని ఆశపడి యువత అవస్థలు పడుతోంది. షేర్‌మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయన్న ఆశతో ఎంతో మంది కనీస అవగాహన లేకుండా అప్పులు చేసి పెట్టుబడి పెట్టి నష్టాలపాలవుతున్నారు. యువత ఆసక్తిని క్యాష్ చేసుకునేలా నిర్వాహకులు మొదట్లో లాభాల ఆశ చూపించి, అనంతరం నిలువు దోపిడీకి గురి చేస్తున్నారు. వడ్డీలు చెల్లించేందుకు తిరిగి అప్పులు చేయడం పరిపాటిగా మారింది. చివరికి ఆ అప్పులు తీర్చే మార్గంలేక బలవంతపు మరణాలకు పాల్పడుతున్నారు.

జల్సాలకు అలవాటు పడి..

వివిధ రంగాలకు చెందిన యువత జల్సాలకు అలవాటు పడి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. విందులు, వినోదాలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ ఉద్యోగంలో సంపాదించి కూడబెట్టిన మొత్తాన్ని నీళ్లలా ఖర్చు చేస్తున్నారు. విలాసాలకు అలవా టుపడటంతో జీతం డబ్బులు సరిపోక అదనపు సంపాదన వైపు దృష్టి మరల్చుతున్నారు.

ఈ క్రమంలో సులువుగా డబ్బు సంపాదించాలనే తలంపుతో ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్స్, షేర్ మార్కెట్లలో పెట్టుబడులు పెడుతున్నారు. మొదట్లో కొంత లాభసాటిగా కనిపించ డంతో అందినకాడికి అప్పులు తెచ్చిమరీ వాటిలో పెట్టుబడులు పెడుతున్నారు. అనంతరం నష్టాలు వాటిల్లి చేసిన అప్పులు తీర్చలేక తనువు చాలిస్తున్నారు. తాను చేసిన తప్పిదానికి కుటుంబ సభ్యులు అబాసుపాలు కాకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో తనతోపాటు ఇంటిల్లిపాది అందరితో బలవంతపు మరణాలకు పాల్పడుతున్నారు.

ఏడాదిలో పది మంది వరకు..

షేర్ మార్కెట్, ఆన్‌లైన్ గేమ్స్ కారణంగా ఒక్క మంచిర్యాల జిల్లాలోనే ఏడాది కాలంలో పది మంది దాకా బలవంతపు మరణాలకు పాల్పడ్డారు. బుధవారం తాండూరు మండలం కాసిపేటకు చెందిన ఒకే కుటుంబంలో నలుగురు వ్యక్తులు క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడగా, చికిత్స పొందుతూ మృతి చెందారు.

ఈ ఏడాది ఆగస్టులో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సంజీవయ్య కాలనీకి చెందిన ఓ కుటుంబం హైద్రాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడింది. ఇప్ప వెంకటేష్ అనే యువకుడు హైద్రాబాద్ లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని గాజుల రామారంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఉండేవాడు.

ఆన్‌లైన్ బెట్టింగ్స్, ట్రేడింగ్ మార్కెట్‌లో పెట్టుబడుల కోసం లోన్‌యాప్‌ల్లో అప్పులు చేశాడు. నష్టాలు రావడంతో అప్పులు తీర్చేమార్గం కానరాక భార్య వర్షిణి, కుమారులు రిషికాంత్, విహాంత్‌లకు విషమిచ్చి, తాను ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. జిల్లా కేంద్రంలోని హమాలివాడలో ఆన్‌లైన్‌లో చేసిన అప్పులు తీర్చలేక ఓ యువతి ఆత్మహత్య చేసుకున్నది. లక్షెట్టిపేటలో ఆన్‌లైన్ బెట్టింగ్‌లో నష్టాల కారణంగా ఓ యువకుడు బలవంతపు మరణానికి పాల్పడ్డాడు.

యువత బలవంతపు మరణాలకు ప్రధాన కారణం అధిక వడ్డీలని తెలుస్తోంది. ఇటీవల జరిగిన బలవంతపు మరణాల్లో అత్యధిక సంఘటనల్లో అధిక వడ్డీలే కారణంగా నిలిచాయి. లోన్ యాప్స్‌లో అప్పులు తీసుకుంటే రూ. 3 చొప్పున వడ్డీ వసూలు చేస్తారు. నెలలో ఏ తేదీకైతే అప్పు తీసుకుంటారో...మరు నెలలో ఆ తేదీ దాటకుండా వడ్డీ చెల్లించాలి. ఒక్కరోజు దాటినా చక్రవడ్డీ వసూలు చేస్తారు. అప్పు తిరిగి చెల్లించలేని పక్షంలో కుటుంబ సభ్యులకు ఫోన్లు చేస్తూ పరువు బజారుకు ఈడుస్తామంటూ బెదిరింపులకు గురి చేస్తారు. పది మందికి తెలిస్తే పరువు పోతుందని భయపడి బలవంతపు మరణాలకు పాల్పడుతున్నారు. డైలీ ఫైనాన్స్ నుంచి మొదలుకొని వారంతపు, నెలవారీ చెల్లింపుల్లో వ్యాపారులు ప్రజల నుంచి అధిక వడ్డీలు వసూలు చేస్తూ నడ్డీ విరుస్తున్నారు. ప్రజల అవసరాన్ని ఆసరగా తీసుకుంటూ వెయ్యి రూపాయలకు నెలకు రూ. 5 నుంచి రూ. 10 వరకు వడ్డీ వసూలు చేస్తున్నారు. డైలీ ఫైనాన్స్ ఇచ్చే సందర్భంలో 100 రోజుల చెల్లింపు ఉంటుంది. రూ. 50 వేలు అప్పు తీసుకునే వ్యక్తి నుంచి మొదలే రూ. 5వేలు మినహాయించుకుని రూ. 45వేలు ఇస్తారు. అతను రోజుకు రూ. 500 చొప్పున వంద రోజులు తిరిగి చెల్లించాలి. ఈ పద్దతిలో రూ. 3 చొప్పున వడ్డీ వసూలు చేస్తారు.

అధిక వడ్డీలు చెల్లించి..

అలాగే నెలవారీ చెల్లింపుల్లో భాగంగా నెలరోజుల కాల పరిమితి ఉంటుంది. రూ. 50వేలు అప్పు కావాలంటే ముందుగానే రూ. 5 వేలు మినహాయించుకుంటారు. 30 రోజులు పూర్తికాగానే అప్పు తీసుకు న్న తిరిగి రూ. 50వేలు చెల్లించాలి. ఈ పద్దతిలో రూ. 5 చొప్పున వడ్డీలు వసూలు చేస్తారు. అలాగే రియల్ ఎస్టేట్ లో పెట్టుబడులు పెట్టే వారికి రూ. 10 చొప్పున వడ్డీ వసూలు చేస్తారు.

ఆంధ్రజ్యోతి
కార్ అండ్ బైక్ రేస్



డిసెంబర్ నెల కూపన్ నంబర్ - 1

పాఠకుని పూర్తి పేరు	:	....
డోర్ నెంబరు	:	....
వీధి పేరు	:	....
గ్రామం / పట్టణం	:	....
మండలం	:	....
జిల్లా	:	....
పోస్టల్ పిన్‌కోడ్	:	....
ఫోన్ నంబర్	:	....

నాలుగు నెలల్లో ఆంధ్రజ్యోతి డ్రాలో ఇది డిసెంబర్ నెల మొదటి కూపన్ ఈ కూపన్‌లో మీ అడ్రస్ పూర్తి చేసి ఈ నెలలో ఇచ్చే మూడు కూపన్లను ఒక సెట్‌గా చేసి మీ వద్దనే ఉంచి మూడు నెలలు అయిన తర్వాత మొత్తం 9 కూపన్లను మూడు సెట్లుగా చేసి 2025 మార్చ్ నెల 10వ తేది నాటికి ఈ క్రింది అడ్రస్‌కు పోస్ట్ ద్వారా కాని, స్వయంగా కాని అందచేయవలెను.

నోట్ : సెట్‌గా కాకుండా విడిగా పంపిన కూపన్లు చెల్లవు.
* చట్ట ప్రకారం నిబంధనలు వర్తించును.



కూపన్లు పంపవలసిన చిరునామా
ఆంధ్రజ్యోతి బిల్డింగ్, హౌసింగ్ బోర్డ్ కాలనీ,
మానేర్ బైపాస్ రోడ్, తీగల వంతెన దగ్గర, కరీంనగర్.
సెల్ : 99854 11271, 99854 11274